# దెయ్యం చెప్పిన సత్యం

క్లబ్బుకు వెళ్ళొద్దామని నిత్యానందం బట్టలు వేసుకొంటున్నాడు. వసంత కాఫీ పట్టుకొచ్చి యిస్తూ "మధ్యాహ్నం మీకు ఉత్తరం వచ్చింది చూశారా?" అంది. టేబిలుమీదున్న ఉత్తరం తెచ్చి అతనికి యిచ్చింది. అతను చించి చదువుకున్నాడు.

హయగ్రీవరావు పత్రిక పెట్టబోతున్నాడట. ప్రారంభ సంచికలో నిత్యానందం కథ ఒకటి వెయ్యాలనుకుంటున్నాడట. అందుకని కొత్తపంథాలో వ్రాసిన కథ ఏమన్నావుంటే వెంటనే పంపించమని ఉత్తరం వ్రాశాడు.

నిత్యానందం ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని క్లబ్బుకు వెళ్ళిపోయాడు. క్లబ్బులో అరుణాచలం పలకరించి "చూశావా! మనం అంతా ఎందుకూ పనికిరాడనుకున్న హయగ్రీవరావు పత్రిక పెడుతున్నాడట! ఉత్తరం వ్రాశాడులే" అన్నాడు.

"అవును. నాకూ ఉత్తరం వ్రాశాడు, కథ పంపమని" అన్నాడు నిత్యానందం.

"అయితే యింకేం, కథ పంపిస్తావన్నమాట" అతను అదోలా నవ్వాడు.

ఎందుకో హయగ్రీవరావంటే అరుణాచలం అసూయ పడుతున్నట్టు అనిపించింది. నిజమే. చదువుకొనేరోజుల్లో హయగ్రీవరావుని చూసినవారు ముందుముందు అతనో పత్రికకు ఎడిటరు అవుతాడని ఎవరూ అనుకోరు. పైపెచ్చు

అతను ఏ గుమాస్తాగిరీకోతప్ప ఎందుకూ పనికిరాడని ఒక అభిప్రాయాన్ని ఏర్పరచు కున్నారు. అలాంటి హయగ్రీవరావు అకస్మాత్తుగా ఒక పత్రికకు ఎడిటరు అయిపోవడం, చాలా కాలంనించి కథలువ్రాయడం ప్రారంభించిన అరుణాచలంలాంటి వాళ్ళకు అసూయగానే వుండొచ్చు.

అరుణాచలం కేరమ్స్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

తానుమాత్రం కథ తప్పకుండా పంపించాలి అనుకున్నాడు నిత్యానందం.

ప్రొఫెసర్ చలపతిరావు వచ్చి "ఏమిటండీ యివ్వాళ ఖాళీగా కూర్చున్నారేం?" అంటూ అడిగాడు.

రంగారావు పేకతెచ్చి "కుర్చీ దగ్గరకు లాక్కోండి, కాస్సేపు ఆడుకుందాం" అని పేక కలిపాడు.

నారాయణకి ఆడాలనిలేదు. "పేక యిప్పుడెందుకండి కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.

"అయితే మీరు కబుర్లు చెప్పుకుంటూ కూర్చోండి" అని వెళ్ళిపోయాడు రంగారావు.

"పూర్ క్రీచర్! పేకాట, సినిమాలు లేకపోతే బ్రతకలేడు" అంటూ చలపతి నవ్వాడు.

అందరూ నవ్వారు.

"అవును, మొన్న ఆదివారం ఎదురై మోర్నింగ్ షోకు వెళ్తున్నానన్నాడు. నిన్న సాయంకాలం ఫస్ట్‌షో మధుమతికి వచ్చాడు" అన్నాడు నిత్యానందం.

నారాయణకు మధుమతి పేరు వినడంతోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్టుంది, కుర్చీని ఆ యిద్దరికీ దగ్గరగా జరుపుకుని "దెయ్యాల్ని గురించి మీ అభిప్రాయ మేమిటి?" అడిగాడు.

"వాంఛలు తీరకుండా చనిపోతే మనుషులు దెయ్యాలవుతారు" అన్నాడు నిత్యానందం.

"ప్రతిమనిషీ ఎప్పుడూ నిశ్చింతగా చనిపోడు. చిన్నవో పెద్దవో తీరని కోరికలు వుంటూనే వుంటాయి. అంతమాత్రంచేత వాళ్ళంతా దెయ్యాలయికూర్చోడంలేదు" అన్నాడు నారాయణ.

"నిజంగా దెయ్యాలంటూ ఏవీలేవు. అది భ్రమ. ఒకరకం జబ్బులో ఆ భ్రమ ఏర్పడుతుంది. ఆ జబ్బు మనస్సుకు సంబంధించినది. పిరికితనం అనేది ఒకరకం సూక్ష్మ జీవుల్లా యీ జబ్బురావడానికి మనసుకు దోహదం చేస్తుంది. అప్పుడు మనసు మన యిష్టం వచ్చినట్టు ఆలోచించదు. ఎప్పుడో తాను చూసిన దానిని ముందుకు తెచ్చుకుని దాన్ని అనుకరించడానికి ప్రయత్నిస్తుంది. దానిలా మాట్లాడుతుంది. హిస్టీరియా ఎలా మన మనసును ఆవరించి ఫిట్స్‌ను రప్పిస్తుందో అలానే యిదీ మన సెన్స్‌ను ఆవరించి మసిలా అలుముకుపోతుంది. ఆ మనిషిలో దాగివున్న ఎప్పుడో ఆ మనిషి చూసిన ఆకారం మనసులోని తెరమీద కదులుతుంది. సినిమాలోలా ఆ ఆకారం గెంతుతుంది, అరుస్తుంది, మాట్లాడుతుంది, పాడుతుంది. అది చూస్తున్నప్పుడు ఆ మనిషే మాట్లాడుతున్నట్టు అనిపిస్తుంది మనకు. ఆ జబ్బు ప్రభావం నుండి తప్పుకోగానే తెరమీది బొమ్మ నిలిచిపోతుంది. మనిషి మామూలువాడవుతాడు. దీన్నే మనవాళ్ళు దెయ్యంపట్టడం అంటారు" అన్నాడు ప్రొఫెసర్.

ఆ సమాధానం నిత్యానందానికి నచ్చలేదు. అసలు అతను చెప్పిందేమిటోకూడా అర్థంకాలేదు. నిజానికి నారాయణ చెప్పిందానితోనే అతని అభిప్రాయం ఏకీభవిస్తోంది.

"కాని సైంటిఫిక్‌గా ప్రేతాత్మలతో మాట్లాడిస్తున్నారుకదా. మరి యిదేమిటం టారు?" అన్నాడు నిత్యానందం.

"అది ఒకరకమైన విద్య. టెలిపతిలాంటిది. ముందు జరగబోయే సంఘటనని మనసు చూచాయగా ఎలాగ్రహిస్తుందో అలాగే యిదీ మనసులోని తెరమీది ప్రతిబింబాల రూపాలని తెలుసుకుంటుంది. టెలిపతిద్వారా ఒకరి మనసులోని ఆలోచనలు మరొకరి మనసులోనూ కలగడం సాధ్యమైనప్పుడు ఒకరి మనసులోని రూపం మరొకరి మనసులోనూ కనిపించడం ఎందుకుసాధ్యంకాదూ!"

రంగారావు మళ్ళీ వచ్చి ఎవరికో పరిచయం చేస్తానని ప్రొఫెసర్‌ని తీసుకెళ్ళాడు. వాళ్ళ చర్చ అంతటితో ఆగిపోయింది.

నారాయణ సీటు ఖాళీ వుందని పేకాటలోకి వెళ్ళి కూర్చున్నాడు.

నిత్యానందం, యింటికి బయలుదేరాడు. హయగ్రీవరావుకి పంపవలసిన కథను గురించి ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు. కథలో కొత్తదనం వుండాలి. అది ఒక ప్రత్యేకతని వ్యక్తం చెయ్యాలి. ఆలోచిస్తున్నాడు. క్లబ్బులో జరిపిన చర్చ జ్ఞాపకం వచ్చింది. దెయ్యం యితివృత్తంతో ఓ కథ రాద్దామని నిశ్చయించుకున్నాడు.

ఇంటికి వెళ్ళి తొందరగా భోజనం పూర్తిచేసి కథ రాద్దామని కూర్చున్నాడు. ఇతి వృత్తానికి సంబంధించిన పూర్తి అవగాహన లేకుండానే కథ ప్రారంభించడంతో రెండు పేరాలు నడిచేసరికి కలం యిక ముందుకి కదల్లేదు. ఒకటీ రెండు రకాల సంఘటనలు ఆలోచించాడుగాని వాటిలోంచి కథను ఎలా పిండాలో అర్థంకాలేదు.

వసంతను పిలిచి తలుపులు వేసుకోమని చెప్పి వీధిలోకి బయలుదేరాడు. ఊరిచివర కొత్తగా ఏర్పడ్డ కాలనీ అతనిది. మూడు ఫర్లాంగుల దూరం వెళ్తే ఎర్రనాగులమెట్ట తగులుతుంది. అక్కడకు వెళ్ళి గుట్ట ఎక్కి కూర్చున్నాడు. చక్కటి గాలి, నిశ్శబ్దమైన వాతావరణం వున్న చోటది. దానికి ఫర్లాంగు దూరంలో దక్షిణంవైపు పెద్దకాపు పుంతవుంది. దానికి అవతల చిట్టడవి.

ఆ ప్రదేశాన్ని చూస్తున్నప్పుడు అతనికి అక్కడ ప్రచారంలో వున్న కథ జ్ఞప్తికి వచ్చింది.

ఎప్పుడో చాలాకాలం కిందట ఆ వూరి జమిందారు తమ్ముడు హరిగోపాలం అనేవాడు పోలి అనే కామందుకూతుర్ని ప్రేమించాడట. ఆ అమ్మాయితో కలిసి రాత్రిళ్ళు పొలాల్లోనూ, కాలవవడ్డునా, మామిడితోటల్లోనూ తిరిగేవాడట. ఈ వార్త వూళ్ళో అందరికీ తెలిసిపోయింది. తెలిసిన తర్వాత రహస్యం ఎందుకని స్వేచ్ఛగా తిరిగేవాళ్ళువారు. కాని ఓ రోజు హరిగోపాలానికి మరో జమిందారు కూతురుతో పెళ్ళయిపోయింది. అదే రోజున పోలి పెదకాపు పుంతమొదల్లో వున్న చింత చెట్టుకు ఉరేసుకుని చనిపోయింది. ఆమె దెయ్యమై ఆ చెట్టుమీదే వుంటూ ఆ చుట్టుపట్ల తిరుగుతూ వుంటున్నదని ఊళ్ళో చెప్పుకున్నారు. ఒకరోజు సాయంకాలం హరిగోపాలం షికారుగా అటు వెళ్ళాడట. ఇంటికి వచ్చేసరికి జ్వరం వచ్చింది. రెండు వారాలు మంచంమీద వుండి చనిపోయాడట.

కథ వ్రాయడానికి యితివృత్తం దొరికింది. దీన్నే కాస్త మార్చి అటూయిటూ చేసి ఓ కథని ఆలోచించాడు. వెంటనే యింటికి వెళ్ళి కథ వ్రాయడం ప్రారంభించాడు. అరగంటసేపు కలం ఆగకుండా పరుగెత్తింది. ఒకమారు కలాన్ని పక్కన పెట్టి ఫ్లాస్కులో టీవంపుకుని తాగి సిగరెట్టు వెలిగించాడు. అది కొనవరకూ కాలిబూడిదై రాలిపోయింతర్వాత దానిని అవతలకు విసిరేసి ఆ చేత్తో కలంతీసి మళ్ళీ ప్రారంభించాడు.

వసంత వెనకనుండి వచ్చి ఏమిటి వ్రాస్తున్నారో అని తొంగిచూసింది. 'వికృతమైన, భయంకరమైన రూపాలు ఆమెను బలవంతంగా తమలోకి లాక్కున్నాయి. అవన్నీ ఆమె చుట్టూచేరి ఆనందంతో గంతులేసి అరుస్తున్నాయి. ఆమెను తమ చేతుల్లో చుట్టేసి

తమలోకి లాక్కుంటున్నాయి. ఆమె సౌందర్యం దెయ్యాల వికృతరూపాలతో కలిసి మసిపూసుకున్నట్టు అయిపోయింది. మోటువాడి చేతుల్లో నలిగిపోయిన పారిజాతంలా ఆమె కాంతి విహీనమైపోయింది...' నిత్యానందం వ్రాసుకొంటూ వెళ్తున్నాడు.

వసంత భర్తమెడమీద రెండు చేతులూ వేసి వంగి "ఎవరండీ అంత అంద గత్తె?" అంది.

"ఇప్పుడు నన్నేమీ కదపక, వెళ్ళిపడుకో. ఈ రాత్రికి కథ పూర్తిచెయ్యాలి" అన్నాడు.

ఆమె మూతిముడుచుకుని అక్కడనుంచి వెళ్ళిపోయి మంచంవాల్చుకుని పడుకుంది. నిత్యానందం ఓమారు నవ్వుకుని మళ్ళీ కథలో మునిగిపోయాడు.

మరో గంటలో కథ పూర్తయ్యింది. వ్రాసిన కాగితాలన్నిటినీ ఒక ఆర్డర్లో పిన్‌చేసాడు. నిద్రకూడా వస్తోంది. ఓమారు ఫ్లాస్కు ఆడించి చూశాడు. శబ్దం వినిపించలేదు. విసుక్కొంటూ దాన్ని పక్కన పెట్టాడు.

ఆ శబ్దానికి అవతల మగత నిద్ర చేస్తున్న వసంత కళ్ళు తెరిచి విచిత్రంగా చూసి "ఇంకా వ్రాస్తూనే వున్నారా!" అంది. పాపం! ఎప్పటినుండో కళ్ళుకాయలు చేసుకుని ఎదురు చూస్తొంటే ఆశ అణగారి నిరాశతో కళ్ళు మూతలుపడ్డాయి. ఆ నిద్రమత్తుతోనే నోట్లో భర్తను నాలుగైదుసార్లు గొణుక్కొంటూ తిట్టుకుంది కూడాను!

నిత్యానందం, ఆమె కప్పుకున్న దుప్పటిని తీసిపారేసి "కథ చదువుతాను విను వసంతం" అన్నాడు.

ఆమెకు చిరాకు వేసింది. "ఇప్పుడేమిటి, యింత అర్ధరాత్రివేళ మీరు చదివేదీను నేను వినేదీను! పొద్దున్న వింటాలెండి" అంది. ఒకసారి బద్ధకంగా ఆవలించి ఒళ్ళు విరుచుకుని కళ్ళుమూసుకుంది.

నిత్యానందం ప్రాధేయపడ్డాడు "ఒక్క పదిహేను నిమిషాలు. ఆట్టేసేపు వద్దులే. అలా పడుకొనే వింటూవుండు. ఉదయం నీకు చదివి వినిపించడానికి నాకు తీరిక వుండదు. రేపు ఉదయమే ఫెయిర్‌చేసి పంపించేయాలి"

"హూ...మీరొకరు ఎప్పుడుబడితే అప్పుడే...చదవండి వింటా. గట్టిగా చదివితే బాబిగాడు లేస్తాడు, కాస్త నెమ్మదిగా చదవండి" గొణుక్కుని, ముసుగు పీకల వరకూ లాక్కుని వినడానికి ఉపక్రమించింది.

నిత్యానందం కథ చదివి వినిపించి 'ఎలా వుంది?'అన్నట్టు భార్య ముఖంలోకి చూశాడు.

"అచ్చం యిలాంటిదే కథ పక్కింటి పిన్నిగారు చెప్పారు" అంది.

"చెప్తే చెప్పారులెద్దూ. ఇంతకూ ఎలావుందంటావ్?"

"బావున్నదీ లేనిదీ నాకేం తెలుస్తుంది, సాహిత్యం గురించి నాకేం తెలుసు గనక."

"నువ్వెప్పుడూ యింతేలే" అంటూ నిత్యానందం విసుక్కుని కథని టేబిలుమీద పెట్టి, దీపం ఆర్పేసి ఆవలించి మంచంమీద ఒరిగాడు.

"ఏమండీ! దెయ్యాలు మీరు వర్ణించినట్టుగా వికృతంగా, భయంకరంగా వుంటాయంటారా? మీరు దెయ్యాల్ని ఎప్పుడైనా చూశారా?" అంది వసంత ముసుగులోంచి తల బైటపెట్టి.

"నేను వ్రాసినదానికి పదిరెట్లు భయంకరంగా వుంటాయి తెలుసా! రూపాయి బిళ్లంత ఎర్రని సింధూరంలాంటి బొట్టు, విరబోసుకున్న జుత్తు, అంచుల్లేని తెల్లటికోక, నవ్వుతున్నప్పుడు బైటపడే పారపళ్ళు, గుంటలుపడ్డ కళ్ళు, చర్మం కనిపించని ఎముకలు, వెనక్కి తిరిగిన పాదాలు అబ్బో ఎంతో భయంకరంగా వుంటాయి! పిరికివాళ్ళెవరైనా చూస్తే వారంరోజులు లేవకుండా మంచంపడ్తారు"

'అలాగా!' అన్నట్టు గుడ్లప్పగించి ఓక్షణం చూసి, ముసుగుని ముఖంమీదకు లాక్కుని ముడుచుకుని పడుకుంది.

నిత్యానందానికి వెంటనే నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు...కళ్ళముందు కథలోని సంఘటనలు...కొద్దిగా నిద్ర...మళ్ళీ తెలివి...క్లబ్బులో సాయంకాలం జరిగిన చర్చ....భార్య ప్రశ్న.....తన జవాబు...మళ్ళీ నిద్ర.

మసకమసకగా చంద్రుని ఆకారం! అలుక్కుపోయినట్టు ఆకాశంలో నక్షత్రాలు. పడీపడనట్టు భూమ్మీద వాటికాంతి. చీకటిని కరిగించలేని ఆ కాంతిలో నిత్యానందం చల్లగాలికని గోదారిగట్టువెంబడే నడుస్తున్నాడు. గట్టంతా ఆవరించి గట్టుకు అటూయిటూ చెట్లు. ఆ చెట్ల కొమ్మల్లో గుడ్లగూబలు అరుస్తున్నాయి. గట్టుకింద నీళ్ళల్లో చిన్నచిన్న తరంగాలులేచి పాములు హూంకరించినట్టు శబ్దం చేస్తున్నాయి. అతని పాదాల చప్పుడుకు దగ్గర్లోని తుప్పల్లో కొద్దిగా సంచలనం రేగి, ఆ తర్వాత మళ్ళీ నిశ్చలత ఏర్పడుతోంది.

నిత్యానందం నడుస్తున్నాడు. తను చాలాదూరం నడిచి వచ్చేసానన్న ధ్యాసే లేదతనికి. నిద్రలోంచి నడిచివస్తున్నట్టు అలా అడుగులు వేసుకుంటూ పోతున్నాడు.

నడుస్తున్న అతని కాలికింద ఏదో మెత్తగా తగిలింది. తుళ్ళిపడి ఒక్క గెంతుగెంతి పదిగజాలు గబగబా అడుగులువేసి ఆగి ఓమారు చుట్టూ చూశాడు.

అతను ఊరువిడిచి చాలాదూరం నడిచివచ్చినట్టు గమనించాడు. దూరంగా చెట్లగుబురుల్లోంచి ఊరుకనిపిస్తోంది. ఊరు చివర గోదావరి గట్టుపక్కన వున్న పాకల్లోని దీపాలు మినుకుమినుకు మంటున్నాయి. తను నిలుచున్నచోట అట్టే చెట్లేమీలేవు. గట్టుకు ఒకవైపు పెద్ద ఖాళీస్థలం, మరోవైపు నీళ్ళల్లోకి పొడుచుకొని నుంచున్న పెద్ద పెద్ద బండరాళ్ళు వున్నాయి.

అవతలి ఖాళీ స్థలంలో అక్కడక్కడ చిన్న చిన్న మంటలూ, నిటారుగా ఆకాశంలోకి సుళ్ళుతిరుగుతూ పోతోన్న తెల్లని పొగలు, నక్కల అరుపులు- చూసేసరికి అది స్మశానమని అతనికి అర్థమైపోయింది. వెళ్ళిపోదామని వెనక్కు తిరిగి పదడుగులు వేసాడు. నడుస్తున్న అతని కాళ్ళకు బ్రేకులు పడ్డట్టు ఆగిపోయాడు. వడ్డున ఎవరో నీళ్ళను కదుపుతున్న శబ్దం, గాజుల గలగలలు వినిపించాయి.

అతనికి ఆశ్చర్యంవేసింది. కళ్ళు చిట్లించి చీకట్లోకి పరిశీలనగా చూశాడు. గట్టుకింద రాతిబండమీద ఎవరో కూర్చున్నట్టు మసగ్గా ఓ ఆకారం కనిపించింది. గట్టుదిగి దగ్గరగా వెళ్ళాడు. ఒక స్త్రీ రాతిబండమీద కూర్చుని కాళ్ళను నీళ్ళల్లో ముంచి ఆడిస్తూ శబ్దం చేస్తోంది.

అతని రాకను గమనించినట్టుగా ఆమె ఒకమారు వెనక్కుతిరిగి చూసి సన్నగా చిరునవ్వు నవ్వి మళ్ళీ మామూలుగా నీటిని శబ్దంచేస్తూ కూర్చుంది.

ఆమె నవ్వినప్పుడు ఆ చీకట్లో నక్షత్రాల్లా ఆమె పళ్ళు జిగేల్‌మన్నాయి. దూరంగా మండుతోన్న కాష్టంలోని వెలుతురు ఆమె కుడిచెంపమీద కొద్దిగా పడుతోంది. పైన ఆకాశంలోని నక్షత్రాలనుండి లేత ఉదారంగు కాంతి ఆమెమీద వాలుతోంది. ఆమె శిరోజాలు గాలికి నాట్యంచేస్తున్నాయి.

నిత్యానందం ఆమెనే చూస్తూ నుంచుండిపోయాడు. ఆమె ఒకమారు దగ్గి గాజుల్ని గలగల్లాడించింది. అతను తేరుకుని అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళినుంచున్నాడు.

"కూర్చోండి" అంది ఆమె.

నిత్యానందం అనుమానంగా చుట్టూ చూశాడు. కనుచూపుమేర ఎవరూ

కనిపించడంలేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. గట్టిగా గాలివీచినప్పుడు మాత్రం గట్టుమీది రావిచెట్టు మీదనుంచి ఎండిపోయిన ఆకులు నీళ్ళల్లోపడి కొద్దిగా శబ్దంచేస్తున్నాయి.

నిత్యానందం ధైర్యం చేసి ఆమెకు కాస్తదూరంలో మరో రాతిబండమీద కూర్చున్నాడు. అతనికి ఏం మాట్లాడాలో తోచలేదు. అలానే ఆమెనే చూస్తూ వుండిపోయాడు.

"ఏమిటి చూస్తున్నారు?" అంది ఆమె అతనివైపు తిరిగి.

"అబ్బే ఏమీలేదు" అన్నాడు అతను.

ఆమె అతనివైపు తిరిగి కిలకిలా పక్షిలా నవ్వింది" ఏమీ లేకపోవడమేమిటి, నేనున్నానుగా యిక్కడ".

ఆమె అంత చనువుగా మాట్లాడ్డం నిత్యానందానికి సంతోషంగా వుంది. రాతిబండమీద మరికాస్త ముందుకి జరిగాడు. ప్రయత్నపూర్వకంగా కదిలినట్టుకాకుండా ఆమె కొద్దిగా దూరంగా జరిగికూర్చుంది.

"ఎక్కడనించి వస్తున్నారు?" ఆమె అడిగింది.

"ఎక్కడనించీ కాదు. నిద్రరాకపోతే షికారుకని యిలా వచ్చాను.మరి నువ్వో?"

"నేనూ అంతే. నిద్రపట్టకపోతే వచ్చి కూర్చున్నాను. ఇల్లు-అదిగో ఆ డాబాలు కనిపిస్తున్నాయికదా, అక్కడే".

చీకటికి అలవాటుపడిన అతనికళ్ళకు యిప్పుడు ఆమె ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది. గుండ్రని ముఖం, తీర్చిదిద్దిన సూదిముక్కు, చిన్ననోరు, శంఖంలా దిగిన కంఠంకింద ఎత్తుగా లేచిన వక్షాలు, బాగా వంపుతిరిగిన సన్నని నడుము-నిత్యానందం ఆమె ఆకారాన్ని అజంతా సుందరులతో పోల్చి చూసుకుంటున్నాడు.

"ఏమిటి అలా చూస్తున్నారు. మీరలా చూస్తుంటే నాకు అదోలా వుంది" అంది ఆమె, సిగ్గుతో ముడుచుకుపోతున్నట్టు ఓరగా అతన్ని చూస్తూ.

అతను మెల్లగా నవ్వాడు. "నువ్వు ఎంత అందంగా వున్నావో చూస్తున్నాను"

"అంత అందంగా వున్నానా?" ఓమారు నిత్యానందం వైపు తిరిగి అదోరకంగా వళ్ళుకదిపి, కళ్ళుతిప్పి ఆశ్చర్యపడినదానిలా అభినయిస్తూ అంది.

"నిజం. నువ్వు అజంతా సుందరిలా వున్నావంటే నమ్ము. నీ అందం నీకు

తెలీదు. నిన్ను చూస్తుంటే ఏ దేవతా స్త్రీయో విహారానికి వచ్చినట్టనిపిస్తోంది. ఆ రంభా ఊర్వశిలు మాత్రం నీకన్నా అందంగా వుంటారా? అక్కడ పుట్టాల్సిన దానివి పొరపాటున యిక్కడ పుట్టావు. అదిగో అలా నువ్విక్కడ కూర్చుంటే రాళ్ళూ రప్పల్తోవున్న యీ ప్రదేశమంతా ఎంత అందంగా, ఎంత నిండుగా కనిపిస్తోందో! అవతల నల్లని విశాలమైన ఆకాశం, పైన నక్షత్రాలు, కింద నీళ్ళు, ఆ పక్క రాళ్ళు, యిక్కడ నువ్వు-నిజంగా ప్రకృతికే నువ్వు సౌందర్యాన్ని ఆపాదిస్తున్నావ్!..."

"అబ్బబ్బ ఆపవయ్యా కవీ నీ కవిత్వం. నన్ను పొగిడితే మీకేమొస్తుంది, యింకా మీరు వ్రాసే కథల్లో ఉపయోగిస్తే నలుగురూ చదివి మెచ్చుకుంటారు".

నిత్యానందం ఆశ్చర్యపోయాడు. తను కథలు వ్రాస్తాడని, రచయితనని ఆమెకెలా తెలుసు?

అతని సందేహం ఆమెకు అర్థమయ్యింది. "ఏం, నాకెలా తెలుసునా అని ఆశ్చర్యపోతున్నారనుకుంటాను? మీరు నన్ను ఎరగకపోతే నేను మిమ్మల్ని ఎరిగివుండకూడదా యేం?" అంది.

నిత్యానందానికి ఎగిరి గంతెయ్యాలనిపించింది. ఆమె తనను ఎరుగునట! అయితే తన కథల్ని చదివివుంటుంది. ఆమెకు అవి నచ్చివుండాలి. తనంటే ఆమెకు మంచి అభిప్రాయమే వుండి వుండాలి.

"చూడు, నీ పేరేమిటో నాకు తెలీదు. అస్తమానం నిన్ను నువ్వు....నువ్వు అనడం బావుండలేదు" అన్నాడు.

"పోనీ మీకు నచ్చిన పేరుతో పిలవండి".

"సుందరి అంటే బావుంటుంది. అలాగే పిలుస్తాను".

ఆమె నవ్వుకుంది. చేతులు రెండూ వెనక్కు బండమీద ఆన్చి నక్షత్రాలవంక చూస్తోంది. గాలి గట్టిగా వీచడంలేదు. నక్కల అరుపులు తగ్గిపోయాయి. ప్రకృతి నిశ్శబ్దమైపోయింది. ఇద్దరూ కొన్ని నిమిషాలు ఒకరినొకరు చూసుకుంటూ వుండిపోయారు.

"నాతో వస్తావా?" నిత్యానందం మౌనాన్ని చెదరగొడుతూ మెల్లగా అడిగాడు.

"ఎక్కడికి?" చిత్రంగా అతనివైపు చూస్తూ అంది.

"మా యింటికి".

"ఎందుకు?"

"ఎందుకేమిటి! నీ అందాన్ని నా రచనల్లోకి ఎక్కిస్తాను. నిన్ను నా కథల్లో నాయకిని చేస్తాను. నువ్వు నా పక్కన సభలకు సన్మానాలకు వస్తుంటే వందలాది ప్రజలు నీ అందానికి హారతులు పడతారు. ఇంత అందాన్ని నువ్విలా అడవిగాచిన వెన్నెల చేసుకొంటావా?"

ఆమెకు నవ్వు ఆగిందికాదు. పెదాల్ని బిగించి బలవంతంగా నవ్వాపుకుని "బాగానే వుంది. మీ కథల్లోకి ఎక్కితే ఉన్న నా అందంకాస్తా వికారంగా మారి వూరుకుంటుంది."

"ఏం?"

"మీ కథలు అంత బావుంటాయికనక."

ఆమె నిజంగా తన రచనల్ని పొగడడంలేదని అతనికి అర్థమయ్యింది.

"నాకథలన్నీ చదివివుంటే నువ్వు అలా అనవు" అన్నాడు.

"మీ కథలన్నీ నేను చదివాను. అవన్నీ నాకు క్షుణ్ణంగా తెలుసు" అంది.

"పోనీ రాత్రి నే వ్రాసిన కథ..."

"నాకు తెలుసు."

"నీకెలా తెలుసు? రాత్రే వ్రాసాను దాన్ని. అబద్ధం ఆడుతున్నావు నువ్వు."

"నాకంతా తెలుసులెండి. పోలికథ కదా అది. అందులో దెయ్యాల్ని వికృతంగా, భయంకరంగా వుంటాయని వర్ణించారుకదా."

నిత్యానందానికి ఆశ్చర్యంవేసింది-ఆ కథ సంగతి ఆమెకెలా తెలుసా అని. మరికాస్తా దగ్గరకు వచ్చి నిదానించి ఆమెను చూశాడు. ఆమె మరికాస్తా దూరంగా జరిగింది.

ఎందుకో అతనికి కొద్దిగా అనుమానం వేసింది.

"అలా దూరంగా వెళ్ళిపోతున్నావేమిటి, దగ్గరకి రా" అన్నాడు.

ఆమె నవ్వుతోంది.

"కాళ్ళు నీళ్ళల్లో పెట్టి ఆడిస్తా వేమిటి? బైటికి తీసి కూర్చోకూడదూ." అన్నాడు.

ఆమె యింకా నవ్వుతోంది.

"నా పాదాల్ని చూసి భయపడిపోరుకదా" అంటూ మెల్లగా ఆమె నీళ్ళల్లోంచి పాదాల్ని బైటికి తీసింది.

నిత్యానందం వళ్ళంతా చెమటలుపట్టింది. బట్టలు తడిసి ముద్దయ్యాయి. గజగజ వణికిపోతున్నాడు. పారిపోదామన్న ఆలోచన వెంటనే తట్టలేదు. తట్టిన తర్వాత పారిపోదామంటే అడుగులేచి అడుగుపడడంలేదు. నోరుకూడా కట్టుబడిపోయింది. ఎల్లాగో లేనిధైర్యాన్ని తెచ్చుకొని ఒక్కొక్క అడుగు వెనక్కు వేస్తున్నాడు.

"కవిగారు భయపడి పారిపోతున్నట్టున్నారు. వెళ్ళుదురుగాని, ముందు యిలా వచ్చి కూర్చోండి" అంది ఆమె.

"అమ్మో!...నువ్వు...దె...దెయ్యానివి" అన్నాడు గజగజ వణికిపోతూ.

"ఫరవాలేదు రండి, నేను మిమ్మల్ని ఏమీచెయ్యను."

తప్పించుకొనిపోవడానికి వీలులేక భయంభయంగా చుట్టూ చూస్తూ అక్కడే ఆమెకు దూరంగా కూర్చున్నాడు. పెదాలు, కాళ్ళు, చేతులు-అన్నీ భయంవల్ల వణికిపోతున్నాయి.

"ఏమిటి కవిగారూ! యిలా వణికిపోతున్నారు?" అందామె సన్నగా నవ్వుతూ. ఆ నవ్వులో యిందాకటి కర్కశత్వం ఏమీలేదు. పూల పరిమళాలు, వెన్నెల వానలు. తేమగాలులు బయటపడ్డాయి. అలా నవ్వేది ఆవిడేనా! అనుకున్నాడు. అతని భయం పోయింది. కాళ్ళూ చేతులూ వణకడం లేదు. మౌనంగా కూర్చున్నాడు.

"నన్నుచూసి యిందాక అలా భయపడ్డారేమిటి! అంతవరకూ నన్ను అజంతా సుందరివని, దేవసుందరివని పొగిడారుకదా. ఇప్పుడు దెయ్యాన్నని తెలిసి ఎందుకంతగా భయపడిపోతున్నారు? నాలో ఏమార్పూ లేదు. అప్పుడెలా వున్నానో యిప్పుడూ అలానే వున్నాను. నిజంగా మీరు నా ఆకారాన్ని చూసి భయపడ్డారనుకోను, నన్ను ఊహించుకుని భయపడ్డారు"

"ఏమో వెనక్కు తిరిగిన నీ పాదాలు చూస్తే నాకలా అనిపించింది."

"పాదాలు వెనక్కు తిరిగి వున్నంతమాత్రాన నా అందం అంత భయంకరంగా మారిపోయిందా? నాపాదాలు సహజంగా లేనిమాట నిజమే. అంతమాత్రంచేత సహజంగాలేని ప్రతి వస్తువునూ చూసి మీరు భయపడుతున్నారా? ఎక్కడో మనిషి తోడేలులా పుట్టాడట. దానిలాగే నడుస్తాడట. నాలుకతో చప్పరించి పాలు తాగుతాడట. అంతమాత్రంచేత జనం భయపడి దూరంగా పారిపోయారా? అతన్ని చూడ్డానికి జనం

తండోపతండాలుగా వచ్చారు. అంతెందుకు మీ మానవుల్లోని రకరకాల మనుషుల్ని ఒకమారు చూడండి. కొంతమంది అంగవిహీనులు, మరికొంతమంది వికృతాంగాల వాళ్ళు. ఇంకొంతమంది అసలు కొన్నికొన్ని శరీర భాగాలే లేనివాళ్ళు. వాళ్ళు కనిపించినప్పుడు వారిని చూసి మీరు భయపడుతున్నారా? నా పాదాలు నా అందానికి కొద్దిగా విరూపాన్ని కలిగించవచ్చుకాని భయపడడానికిమాత్రం కారణంకావు. మీ నోటితోమీరు పొగిడిన నా అందం, రంభ ఊర్వశిల్లాంటి నా రూపం మీరు భయంకరంగా ఊహించి వ్రాయడం నేను సహించలేను. ఎవరో కిట్టనివాళ్ళు మా ఆకారాల్ని వికృతంగా ఉన్నాయని, భయంకరంగా వున్నాయని చెప్తే దాన్ని మీలాటివారు గుడ్డిగా నమ్మి అనుసరిస్తున్నారు. మమ్మల్నీ మా ఆకారాల్నీ మార్చేస్తున్నారు. ఇలాటి మీరచనల్లోకి ఎక్కితే నా ఆకారం ఎలా తయారవుతుందంటారు? రాత్రి రాసిన కథనిండా అన్నీ ఇలాంటివే వున్నాయి. అది వట్టి తప్పుల తడక."

ఆమె చెప్పినదాంట్లో యథార్థం వున్నదనిపించింది. అది అబద్ధం అనలేడు. కాదని ఎదురుచెప్పడానికి వీలులేనట్టుగా ఆమె ఆ విషయాన్ని వ్యక్తం చేసింది. తనకు ఒక కొత్త విషయాన్ని తెలియజేసినందుకు కృతజ్ఞత చెప్పుకుందామనుకున్నాడు. కాని ఆమె చివరగా అన్న వాక్యం అతనికి బాధకలిగించింది. ఒక చిన్న తప్పుచేత ఆ కథంతా వట్టి తప్పులతడక అని ఆమె అనడం అతను సహించలేకపోయాడు.

"నువ్వు చెప్పింది యథార్థమే అని వప్పుకుంటాను. కాని అంత చిన్న తప్పుచేత ఆ కథంతా పనికిరాదని నువ్వు అనడం బాధగా వుంది" అన్నాడు.

"అదొక్కటే తప్పయితే నేను కథనంతా ఎందుకు విమర్శిస్తాను. సరిగ్గా జ్ఞాపకం చేసుకోండి, అక్కడ మీరేంరాశారు. పోలి ఉరేసుకుని చనిపోయినప్పుడు మేమంతా ఆమెను మాలోకి బలవంతంగా లాక్కున్నామని, ఆమె చుట్టూ చేరి సంతోషంతో గెంతుతూ అరుస్తూ ఆడుతున్నామని, ఆమె సౌందర్యాన్ని మేమంతా నాశనం చేసి పారిజాతంలాంటి ఆమెను నలిపిపారేశామని వ్రాశారుకదూ."

"అవును వ్రాశాను. ఆమె చస్తే ఆమె ఆత్మ ఊర్ధ్వలోకాల్లోకి పోయి ముక్తిని పొందకుండా మీరంతా అడ్డుపడి మీలో కలుపుకోలేదూ?"

"అలా చెయ్యడం తప్పంటారా మీరు? మా బలాన్ని మేము అభివృద్ధి చేసుకోవడం తప్పెలా అవుతుంది? ఆమె చనిపోతే ఆమెను మా బలగంలో కలుపుకున్నాం. స్వజాతి అభిమానం ప్రతివారికీ వుంటుంది. తమ జాతి అభివృద్ధికావాలని

ప్రతిఒక్కరూ తలుస్తుంటారు. అంతెందుకు మీ చుట్టూ చూడండి. ఇప్పుడు మీరు చేస్తున్నదేమిటో అర్థం చేసుకోండి. పార్టీల ప్రాబల్యం పెరిగిన యీ రోజుల్లో ఎటుచూసినా, ఎప్పుడు చూసినా మీకు ఎదురుగా కనిపించేదేమిటి? తమతమ పార్టీల బలగాన్ని పెంచుకోవాలని పడే పాట్లేకదా. ప్రజలంతా వచ్చి తమ పార్టీలో చేరాలని, ఎక్కువ మెజారిటీ సంపాదించాలని– అందుకని అనేకరకాల ఉపాయాలు, ఆకర్షణలు, యుక్తులు, కుయుక్తులు, కక్షలు! ఒక పార్టీ అంటే మరో పార్టీకు పడదు. ఇద్దరి మధ్యా ఘర్షణలు, కొట్టుకోవడం, చంపుకోవడాలు. మీరు చేస్తున్నదే మేమూ చేస్తున్నాం. మీరు చెయ్యగా తప్పుకానిది మేం చేస్తే తప్పెలా అవుతుంది? న్యాయమనేది అందరికీ ఒకటే. అందువల్ల ఆ భాగాన్ని కథలోంచి తీసెయ్యండి. లేదా కొత్తగా వ్రాయండి. ఏమంటారు?" ఆమె కొరకొరా చూసింది.

నిత్యానందం చేతులు కట్టుకున్నాడు. "నిజమే నువ్వు చెప్పింది ముమ్మార్తులా యధార్థమే. అలాగే చేస్తాను."

"ఏమిటండీ ఆ చెప్పినది? అలా పలవరిస్తున్నారేమిటి... కలేమైనా వచ్చిందా?" వసంత భర్తను లేపుతూ అంది.

"ఉండవే, వెధవగోలా నువ్వూనూ. ఇంత చలిలో పొద్దుటే లేపకపోతే ఏం పోయె" అంటూ ఆవలిస్తూ లేచిన నిత్యానందంకు, ప్రప్రథమ దర్శనంగా బాబిగాడు ఎదురుగుండా చలిమంట వేసుకుంటూ సగం కాలిన కాగితాల కట్టతో కనిపించేసరికి నిత్యానందంకు ఆతృత ఎక్కువై కళ్ళను ఓమారు గబగబా రుద్దుకుని, రాత్రి టేబిలుమీద కథ పెట్టిన స్థలంలోకి చూస్తే అక్కడ టేబిలు ఖాళీగా కనిపించింది!